సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

మంగళవారం 7-1-2025

సంపుటి: 20 సంచిక: 242

పేజీలు: 4 వెల: రూ.1


# ప్రధాని తొలిసారి సభను విజయవంతం చేద్దాం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- సభావేదిక, ఏర్పాట్లు పరిశీలన



(సత్యంన్యూస్, విశాఖపట్నం)

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి విశాఖపట్నం రానున్న నేపథ్యంలో సభను విజయంతం చేసేందుకు అంతా సమష్టిగా ఏర్పాట్లన్నింటినీ పకడ్బంధీగా చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో తన సహచర మంత్రులు, కూటమి నాయకులతో సమాలోచనలు జరిపారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించే సభకు ఉన్న ప్రాధాన్యాన్ని అంతా గుర్తించాలని, ఆ మేరకు అంతా నడుచుకోవాలని సూచించారు. ఎక్కడా ఏ ఇబ్బందులు లేకుండా ఉత్తరాంధ్ర ఖ్యాతిని పెంచేలా కూటమి నాయకులంతా పని చేయాలని కోరారు. ముఖ్యంగా యంత్రాంగం అలసత్వం వహించకుండా ఉండాలని కోరారు. మోడీ పర్యటనతో రాష్ట్రాభివృద్ధి దశ, దిశ మరింతగా మారనున్నాయని, ఆయన చొరవతోనే రెండు లక్షల కోట్ల అంచనా విలువైన పెట్టుబడులు వివిధ రూపాలలో సమకూరనున్నాయని, కీలక ప్రాజెక్టుల రూపకల్పన సాధ్యమని మంత్రి అచ్చెన్న తెలిపారు. విశాఖపట్నం ప్రపంచస్థాయి నగరంగా చేసేందుకు ప్రధాని మోడీ కృషి చేయనున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. అందుకు అనుగుణంగానే కొన్ని కీలక ప్రాజెక్టులకు ఆయన ఆమోదం తెలిపారని గుర్తు చేశారు. ఎన్నికల తర్వాత నగరానికి వస్తున్న మోడీకి అపూర్వ స్వాగతం పలికి ఈ సభను చరిత్రలో నిలిచిపోయే విధంగా చేద్దామని పిలుపునిచ్చారు. అతిథిలు రానున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం కూడా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. సభావేదిక స్వయంగా పరిశీలించారు. మంత్రి వెంట కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కార్గిల్ పార్క్‌లో

# ఏమేరకు తినేశారు?

'సత్యం' కథనంపై ఆరా తీయాలన్న కలెక్టర్ । క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్





సంచలన సాయంకాల పత్రిక

సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 3-1-2025

సంపుటి: 20 సంచిక: 239

పేజీలు: 4 వెల: రూ.1

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

జేబులు నింపుకొనే పనులు

- రూ. 50 లక్షలు పోసినా మారని పార్క్ పరిస్థితి
- కార్గిల్ పార్క్ గతం కంటే అధ్వాన్నం
- ఇంజినీరింగ్ అధికారుల కల్పతరువుగా తూతూ పనులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక కొత్త హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న కార్గిల్ పార్క్‌లో రూ. 50 లక్షలు ఖర్చు పెట్టి చేపట్టిన ఆధునీకరణ పనులు బూడిదలో పోసిన పన్నీరైపోయిందని, ఇద్దరు కాంట్రాక్టర్లు రెండు విడతలుగా పనులు చేసినా ఇక్కడ నీరు నిల్వ ఉండిపోతుందని 'సత్యం' జనవరి 3న ప్రచురించిన 'ఉల్లాసంగా ఉత్సాహంగా జేబులు నింపుకొనే పనులు' కథనంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తీవ్రంగా స్పందించారు. మరోవైపు ఎమ్మెల్యే గొండు శంకర్ కూడా మున్సిపల్ అధికారులతో మాట్లాడి ఉన్నఫలంగా పార్కు పరిస్థితిని, పనుల తీరును పరిశీలించాలని సూచించారు. దీంతో కమిషనర్ దుర్గాప్రసాద్ ఈ నెల 4న కార్గిల్ పార్కులో - మిగతా 4లో



- పేకాట శిబిరాల దారిలోనే దొంగనోట్ల ముఠాలు
- అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకుంటున్న యువకులు
- లాభసాటి వ్యాపారం కావడంతో అటువైపు మళ్లుతున్న వ్యాపారులు
- పది రోజుల్లో రూ.68 లక్షలు లాభం గడించిన నిర్వాహకులు

## ఒక్క పేకాట..

# వంద దరిద్రాలు

పేక ఎవరాడరు? దొరికితే దొంగలు.. దొరక్కపోతే దొరలు. అయినా ఎవడి సరదాకు వాడు పేకాడుకుంటే మీకొచ్చిన నష్టమేంటి? పోలీసులే దీన్ని సాధారణంగా చూస్తుంటే ఎందుకంత రచ్చ? అనేవారు ఒక్కసారి ఈ కథనం చదవాలి.

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆమధ్య పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఒక యువకుడు చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. యథావిధిగా మరుసటి రోజు పత్రికల్లో కుటుంబ కలహాల వల్ల కలతచెంది మరణించాడని కథనాలు వచ్చాయి. పోలీసులు కూడా దాన్నే ధృవీకరించారు. పైపైన చూస్తే పోలీసులు ధృవీకరించింది వాస్తవం. ఆత్మహత్య చేసుకున్న యువకుడికి కుటుంబ సమస్యలు ఉన్నాయి. అయితే అవి ఎందుకొచ్చాయి? నిండా ముప్ఫై ఏళ్లు లేని ఒక యువకుడికి అంత కష్టం ఏమొచ్చింది? మూలాల్లోకి వెళితే అనేక విషయాలు బయటపడ్డాయి. తాము భారీ భవంతులు కట్టుకోడానికి, బంగారాన్ని - మిగతా 4లో



అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

# 'దెయ్యం' బెడద వదిలింది!

- పాలకొండ రోడ్డులో మోనోకార్పస్ చెట్లు తొలగింపు
- 'సత్యం' కథనాలపై దిగొచ్చిన యంత్రాంగం
- కృతజ్ఞతలు చెబుతున్న పాలకొండ రోడ్డు వ్యాపారులు



సంచలన సాయంకాల పత్రిక

సత్యం

https://www.satyamdaily.net/


మంగళవారం 24-12-2024

సంపుటి: 20 సంచిక: 230

పేజీలు: 4 వెల: రూ.1


దెయ్యం చెట్లు..!

- వ్యాపారాలు హరిస్తున్న మోనోకార్పస్
- పాలకొండ రోడ్డు చీకటిమయం
- తొలగించడానికి ముందుకురాని కార్పొరేషన్
- రోడ్డున పడుతున్న కుటుంబాలు ఏటికేడాది పెరుగుదల



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వ్యాపారమంటే జీటీ రోడ్డు మాత్రమేనని, పాలకొండ రోడ్డులో ఎటువంటి షాపు పెట్టినా కొద్దిరోజులకే మూసేయాల్సిన పరిస్థితి ఉందని తేలిపోయిన రోజుల్లో దెయ్యం పట్టినట్లు డివైడర్ మధ్యనున్న చెట్లు పూర్తిగా ఇక్కడ వ్యాపారాలను దెబ్బతీసిన వైనంపై కొద్ది రోజుల క్రితం 'సత్యం' ఓ కథనం ప్రచురించింది. అంతకు ముందే గత ఏడాది ఆగస్టు 3న 'సిక్కోలుపై విషం కక్కుతున్నాయ్' పేరిట అసలు ఈ మోనోకార్పస్ మొక్కలు పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ఎలా ప్రతిబంధకంగా మారిందన్న అంశంపై సైంటిఫిక్ అప్రోచ్‌తో ఆధారాలతో కూడిన కథనాన్ని 'సత్యం' ప్రచురించింది. సరిగ్గా అక్కడికి రెండు రోజుల్లో రాష్ట్ర వ్యవసాయ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి జిల్లాకు వచ్చిన తర్వాత అధికారులతో సమీక్షించిన కింజరాపు అచ్చెన్నాయుడు నగరంలో మోనోకార్పస్ చెట్లు ఎక్కడున్నా తొలగించాలని ఆదేశాలిచ్చారు. ఆ తర్వాత ఆ స్థానంలో పర్యావరణ హితమైన కొత్త మొక్కలు నాటాలని, అందుకు నిధులు కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. అయితే ఈ టెండర్ల ప్రక్రియలో ఏం జరిగిందో తెలియదు గానీ ఆగస్టు నుంచి ఇప్పటి వరకు ఈ చెట్లు తొలగింపునకు నోచుకోలేదు. తాజాగా ఇక్కడ మున్సిపల్ వీధిదీపాల వెలుగును సైతం ఈ మొక్కలు మింగేసి అమావాస్య చీకట్లను వ్యాపారుల జీవితాల్లో నింపుతోందని 'సత్యం' 'దెయ్యం చెట్లు' పేరిట డిసెంబరు 24న మరో కథనం ప్రచురించింది. దీంతో కమిషనర్ దుర్గాప్రసాద్ ఆగమేఘాల మీద చెట్లు తొలగించి వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటే టెండర్‌ను ఖరారు చేయించారు. ఇప్పుడు ఆ పనులు మంగళవారం ఉదయం ప్రారంభమయ్యాయి. స్థానిక ఏడురోడ్ల జంక్షన్ నుంచి డే అండ్ నైట్ కూడలి వరకు ఉన్న ఈ చెట్లను యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నారు. సరిగ్గా సంక్రాంతి వ్యాపారం జీటీ రోడ్డును నింపేసి పాలకొండ రోడ్డు వైపు మళ్లనున్న ఈ వారం రోజుల్లో మోనోకార్పస్ చెట్లు తొలగించడం పట్ల పాలకొండ రోడ్డు వ్యాపారులు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాలకొండ రోడ్డులో ఉన్న మోనోకార్పస్ చెట్లు తొలగించాలని 'సత్యం' మొదట్నుంచి స్థానికుల తరఫున పోరాడుతునే ఉంది. ఆలస్యంగానైనా స్పందించినందుకు కార్పొరేషన్ అధికారులు, కలెక్టర్, మంత్రి అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు చెప్పాల్సిందే. ఎందుకంటే 'సత్యం' కథనాలు పట్టుకొని తమ కుటుంబాలతో సహా కలెక్టర్‌ను కలిసి వినతినివ్వడానికి పాలకొండ రోడ్డు వ్యాపారులు సిద్ధమవుతున్నారు. సరిగ్గా ఇదే సమయంలో మోనోకార్పస్ చెట్లను తొలగించడం పెద్ద ఊరటే.



సంచలన సాయంకాల పత్రిక

సత్యం

శనివారం 3-8-2024

సంపుటి: 20 సంచిక: 112

పేజీలు: 4 వెల: రూ.1

సిక్కోలుపై విషం కక్కుతున్నాయ్!


ప్రారంభించిన 20 రోజుల్లోనే
ఖాతాదారుల ప్రేమాభిమానాలు పొంది
సంక్రాంతికి సరికొత్త స్టాకును అందించే
అవకాశం కల్పించిన అందరికీ ధన్యవాదములతో..

| | |
|---|---|
| కంచిపట్టు | ఫ్యాన్సీ శారీస్ |
| ధర్మవరం పట్టు | డిజైనర్ శారీస్ |
| మంగళగిరి పట్టు | వర్క్ శారీస్ |
| ఉప్పాడ పట్టు | ప్యూర్‌సిల్క్ |
| బెనారస్ పట్టు | ప్రింటెడ్ సిల్క్ |
| కుబేర పట్టు | లంగావోణీ సెట్‌లు |
| ఆర్‌గంజి పట్టు | |

శ్రీ వారాహి సిల్క్స్

కృష్ణాపార్క్ దగ్గర, పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం

• ఎడిటోరియల్

# వైరస్‌కు కూడా సీక్వెల్స్ ఉంటాయి

బాహుబలి-1, బాహుబలి-2, కెజిఎఫ్-1, కెజిఎఫ్-2, పుష్ప-1, పుష్ప-2.. ఇప్పుడు సీక్వెల్ సినిమాలు సాధారణమయిపోయాయి. వైరస్‌కు కూడా సీక్వెల్స్ ఉంటాయి. కరోనా-1, కరోనా-2. ఈ రెండు పాండెమిక్ దశలు. అటుపై కరోనా-3 అంటే ఓమిక్రాన్ వచ్చింది. మనం లెక్క వేసుకోలేదు కానీ.. ఇప్పటికి కరోనా 4, 5, 6 వచ్చి పోయుంటాయి. ఇది ఎండెమిక్ దశ. రెండు దాటితే.. పాండెమిక్.. ఎండెమిక్ అయిపోతుంది. పాండెమిక్‌కు, ఎండెమిక్‌కు తేడా తెలుసుకోవడం అవసరం. వైరస్ తొలిసారిగా పుట్టినప్పుడు (కరోనా విషయంలో పుట్టించినప్పుడు అని వాడాలి) అది పాండెమిక్ అయ్యే అవకాశముంది. గాలి ద్వారా వ్యాపించేది.. అంటే శ్వాసకోస సంక్రమణ. సహజంగానే వేగంగా విస్తరిస్తుంది. వైరస్‌ను చంపే మందు ఇప్పటి వరకు రాలేదు. భవిషత్తులో రావడం అంత ఈజీ కాదు. వైరస్ వేగంగా సంతానోత్పత్తి చేయకుండా ఇతర కణాలకు చొరబడకుండా చేసే మందులు మాత్రం వచ్చాయి. కాబట్టి అది వందేళ్ల నాటి స్పానిష్ ఫ్లూ కావొచ్చు, మొన్నటి కరోనా కావొచ్చు. వైరస్‌ను చంపింది మనుషుల శరీరంలోని ఇమ్యూనిటీ వ్యవస్థే. వ్యక్తి ఇమ్యూనిటీ బాహుబలిలా బలీయంగా ఉంటే, కనీసం మాదిరిగా ఉంటే.. వైరస్ చచ్చి ఊరుకుంటుంది. ఇమ్యూనిటీ బలహీనంగా ఉన్నవారు పాండెమిక్ దశలో మరణిస్తారు. పాండెమిక్ దశలో వైరస్ ఇంచుమించు జనాభా మొత్తానికి సోకుతుంది. (ముఖ్యంగా గాలి ద్వారా వ్యాపించే కరోనా లాంటివి) కనీసం ఎనభై శాతానికి సోకినప్పుడు హెర్డ్ ఇమ్యూనిటీ వస్తుంది. వైరస్ సోకినప్పుడు.. ఇమ్యూనిటీ కనీసం ఒక స్థాయిలో ఉన్నవారు బతుకుతారు. ఇమ్యూనిటీకి మనలాగే సెల్ఫీ పిచ్చి. అదే మానవాళిని కాపాడేది. వైరస్ అంటే శత్రువు కదా. శత్రువును చంపుతున్నప్పుడు అది సెల్ఫీ తీసుకొని భద్రపర్చుకుంటుంది. ఇమ్యూనిటీకి ఫోటోగ్రాఫిక్ మెమరీ ఉంటుంది. ఇమ్యూనిటీలోని మెమరీ-బి సెల్స్, మెమరీ-టి సెల్స్ వైరస్‌ను గుర్తు పెట్టుకొంటాయి. ఒక్కసారి వైరస్/బాక్టీరియా సోకితే టి సెల్స్ రక్షణ వచ్చేస్తుంది. టి సెల్స్ ఆ రోగకారక జీవిని గుర్తుపెట్టుకొని ఇంకోసారి సోకితే టక్కున చంపేస్తాయి. సీక్వెల్ మాదిరిగా రెండోసారి, మూడోసారి సోకితే ఫ్లాప్ అయ్యే అవకాశం ఎక్కువ. అందుకే పాండెమిక్ దశ దాటితే వచ్చేది ఎండెమిక్ దశ. పాండెమిక్‌లో ఒకటా? రెండా? ఎన్ని వేవ్‌లు? అనేది మొదటి దశలో వ్యాధి ఎంతమందికి సోకింది? అనేదానిపై ఆధారపడుతుంది. కరోనా మొదటి వేవ్‌లో పెద్దగా జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఎక్కువ మందికి సోకడం, హెర్డ్ ఇమ్యూనిటీ రావడం జరిగిపోయింది. ఇక్కడ తొలి దశలోనే ఎక్కువ నష్టం జరిగింది. రెండో దశ ఇక్కడ పెద్దగా ప్రభావం చూపలేదు. అదే ఎక్కువ జాగ్రత్తలు తీసుకొన్న చోట్ల హెర్డ్ ఇమ్యూనిటీ రాక రెండో దశ అరివీర భయంకరం అయ్యింది. ఎండెమిక్ దశ అంటే వైరస్ పోదు. పాండెమిక్ దశ తర్వాత అది మన మధ్య స్థిరపడిపోతుంది. మన శరీరాల్లో అప్పటికే దానికి సంబంధించిన సహజ ఇమ్యూనిటీ ఉంటుంది. అదేనండి టి సెల్స్ రక్షణ. దానితో వైరస్ తోక ముడిస్తుంది. మరీ బలహీనమైన ఇమ్యూనిటీ వ్యవస్థ వున్నవారిని తప్పించి అది సీక్వెల్‌లో ఎవరినీ ఏమీ చేయలేదు. అంటే వారి ఇమ్యూనిటీ ఇటీవల బాగా బలహీనం అయి ఉంటే టి సెల్స్ రక్షణ కూడా ఏమీ చేయలేదు. అలాంటి వారే ఎండెమిక్ దశలో కూడా చనిపోతారు. హెచ్‌ఎంపీవీ దీన్ని 2001లో గుర్తించింది. దానికి కనీసం యాభై ఏళ్ల ముందు నుంచి ఇది ఉందని శాస్త్రవేత్తల అంచనా. ఇది గాలి ద్వారా సోకే వైరస్. మన దేశంలో జనాభా, జనసాంద్రత ఎక్కువ. అప్పట్లో సరిగా రికార్డు చేయలేదు కానీ ఇది ఏనాడో.. అంటే మన తాతల కాలంలోనే పాండెమిక్ దశ దాటి ఎండెమిక్ అయిపోయుంటుంది? 2 తర్వాత 1 ఎలా వస్తుంది పుష్పా? హెచ్‌ఎంపీవీ ఇప్పుడు పాండెమిక్ కాబోతుంది అని ప్రచారం. ఎండెమిక్ అయ్యింది.. పాండెమిక్ ఎలా అవుతుంది? ఇది మనందరికీ ఏనాడో సోకి ఉంటుంది. ఒకటి కాదు.. అనేక సార్లు సోకివుంటుంది. దీనికి సంబంధించిన టి సెల్స్ రక్షణ మనకు ఉంది. ఇంకో మాట.. హీరో గారు పిల్లి గడ్డం పెట్టుకొని వస్తే... విలన్ గుర్తించలేడు.. ఇది సినిమాల్లో. కానీ ఇది నిజజీవితం. ఇక్కడ ఉన్నది బాహుబలి ఇమ్యూనిటీ హీరో. వైరస్ ఎన్ని వేషాలు వేసినా.. అంటే ఎన్ని మ్యుటేషన్‌లు పొందినా బి సెల్స్, టి సెల్స్ టక్కున పట్టేస్తాయి. ఇది ఖాయం. కాబట్టి హెచ్‌ఎంపీవీ పాండెమిక్ కాబోదు. టెస్ట్‌లు చేస్తే కేవలం నాలుగు నగరాల్లో కాదు. ఊరువాడా దీని ఆనవాళ్లు కనిపిస్తాయి. ఇప్పుడు.. ఆ మాట కొస్తే ఎప్పుడూ... కావలసింది బలమైన ఇమ్యూనిటీ వ్యవస్థ. అదే శ్రీరామరక్ష.

# పరిశుభ్ర భారత్ సాధన మనందరి కర్తవ్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దేశాన్ని శక్తివంతమైన, బలమైన, ప్రపంచంలో అత్యంత అగ్రగామి దేశంగా తయారు చేసే నిరంతర శ్రామికులు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అని శ్రీకాకుళం జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ సామాజికవేత్త ఇజ్జాడ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ-14 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో మెగా స్వచ్ఛభారత్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి డాక్టర్ యాల్ల పోలినాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ మాజీ గవర్నర్ గేదెల ఇందిరా ప్రసాద్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి మానసపుత్రిక స్వచ్ఛభారత్ అన్నారు. స్వచ్ఛమైన భారతావని సాధనే మనందరి బాధ్యతగా భావించి ప్రతీ ఒక్కరూ వారివారి ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశయం నెరవేరుతుందన్నారు. ఆరోగ్యభారత్ ఆవిష్కరణలో ప్రతీఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛతే సేవా కార్యక్రమం పగడ్బందిగా చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు సేవానిరతిని స్ఫూర్తిని పలువురు ప్రముఖులు ప్రశంసించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, దీన్ని ప్రతీ ఒక్కరూ విధిగా పాటించి పరిశుభ్రమైన స్వచ్ఛమైన భారత్ ఆవిష్కరణకు కృషి చేయాలని కోరారు. స్వచ్ఛ శ్రీకాకుళం సాధన కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని కోరారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టాలని.. ఆనాడే ఆరోగ్యభారత్ ఆవిష్కరణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల లక్ష్మీ, శాసపు జోగినాయుడు, వావిలపల్లి జగన్నాథనాయుడు, వాకర్స్ గవర్నర్ కొంక్యాన మురళి, పీజీ గుప్తా, సుగంధం సంజీవరావు, గొర్లె వాసుదేవరావు, గోలి ఉమామహేశ్వరరావు, మెట్ట దనుంజయబాట్లు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.




# పథకాలను సక్రమంగా అమలు చేయండి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దళితులు ఎన్నో ఉద్యమాలు చేసి సాధించుకున్న 27 పథకాలను అమలు చేయడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం అయినా వాటిని అమలు చేసేవిధంగా చూడాలని కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో నిర్వహించిన సమావేశంలో సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క క్రిష్ణయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బెలమర ప్రభాకర్, ఎస్వీ జగన్నాథం, రాకొటి రాంబాబులు మాట్లాడారు. ఎస్సీలను అభివృద్ధి చేస్తామని చెప్పి మాల కార్పొరేషన్, మాదిగ కార్పొరేషన్, రెల్లి కార్పొరేషన్‌లకు రాష్ట్ర స్థాయి,జిల్లా స్థాయి ప్రత్యేక అధికార్లను ఐఏఎస్‌లను నియమించాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్, గిరిజనులకు ట్రైకాల్(ఐటీడీఏ) ద్వారా ప్రతి మండలానికి 100 యూనిట్లు, మున్సిపాలిటీ పరిధిలో 200 యూనిట్లు, కార్పొరేషన్ పరిధిలో 300యూనిట్లు రుణాలు మంజూరు చేయాలన్నారు. 50శాతం సబ్సిడీతో బ్యాంక్‌తో సంబంధం లేకుండా డైరెక్ట్ లోన్స్ ఇప్పించాలన్నారు. అదే విధంగా ఎన్ఎఫ్‌డీసీ లోన్స్‌ను పునరుద్ధరించాలని, ఎస్సీ/ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను 34వేల కోట్లు ఎస్సీలకు, 20వేల కోట్లు ఎస్టీలకు మంజూరు చేయాలన్నారు. అర్హులైన ఎస్సీలందరికీ 400 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించాలన్నారు. భూమి కొనుగోలు పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వసతి గృహాలు, గురుకుల పాఠశాల అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. ప్రతినెల విద్యార్థిని, విద్యార్థులకు అమ్మఒడితో సంబంధం లేకుండా నెలకు రూ.500 కాస్మొటిక్ చార్జెస్ ఇవ్వాలని, లేకుంటే నేరుగా నూనె, సబ్బులు, విద్యార్థినులకు పిన్నులు, రిబ్బన్లు, విద్యార్థులకు తల జుత్తు కటింగ్ ఖర్చులు చెల్లించాలన్నారు. కులాంతర వివాహాల పథకాన్ని అమలు చేయాలన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అలికాన లక్ష్మీనారాయణ, కృష్ణలు పాల్గొన్నారు.

# నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు

(సత్యంన్యూస్, రాజాం)

నేత్రదానంతో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు పేర్కొన్నారు. రాజాం నగర పంచాయతీ కొండమ్మపేట వృద్ధాశ్రమంలో నివశిస్తున్న బాసన భాస్కరరావు (70) అనారోగ్యం కారణంగా మృతి చెందగా కుటుంబ సభ్యుల అంగీకారంతో రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్త సాయి ప్రశాంత్‌కుమార్, రెడ్‌క్రాస్ ప్రతినిధి జాతీయ యువజన అవార్డ్ గ్రహీత పెంకి చైతన్య కుమార్, ఓల్డేజ్ హోం ప్రతినిధి పెద్దపూడి శ్రీనివాస్, బొమ్మన కేశవ, కుటుంబసభ్యులు బొల్ల లలితా రాణి అందరూ కలిసి రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు గారికి తెలియజేసారు. దాంతో మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ పూతి సుజాత, సహాయకులు నంది ఉమశంకర్ ద్వారా అతని కార్నియాలు సేకరించి విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. వారి మృతికి సంతాపం తెలియజేస్తూ దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, సెక్రటరీ బి.మల్లేశ్వరరావు, ట్రెజరర్ దుర్గా శ్రీనివాస్, ఇతరసభ్యులు అభినందించారు. ప్రస్తుత కాలంలో నేత్రదానంపై అవగాహన, చైతన్యం ప్రజల్లో బాగా పెరుగుతుందని, ఈ విధంగా నేత్రదానం ద్వారా మరొకరికి ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం కలుగుతుందని, అంధత్వ రహిత సమాజ స్థాపనకు యువత, ప్రజలు కృషి చేయాలన్నారు. నేత్ర దానం చేయాలనుకునే వాళ్ళు 78426 99321 నంబరుకు కాల్ చేయాలని కోరారు. రాజాం ప్రాంతంలో ఎవరైనా నేత్రదానం చేయాలనుకుంటే కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ 9440131160, పెంకి చైతన్యకుమార్ 9441708120లను సంప్రదించాలని సూచించారు.



'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

# బాలయ్యకు కలిసొస్తున్న హీరోయిన్..!

నందమూరి బాలకృష్ణతో ప్రస్తుతం 3 సినిమాలు నటించి తన క్రేజ్ చాటేలా చేస్తుంది ప్రగ్యా జైశ్వాల్. బాలయ్యతో అఖండ సినిమాలో నటించిన అమ్మడు ఆ సినిమా సూపర్ హిట్ అవ్వడంతో ఆఫర్లు పెద్దగా రాబట్టలేదు కానీ మర్చిపోకుండా చేసుకుంది. ఐతే అఖండ సీక్వల్‌లో మళ్లీ ప్రగ్యానే కథానాయికగా ఎంపిక చేశారు. క్రేజీ సీక్వల్ లో నటించడం పట్ల చాలా సంతోషంగా ఉంది ప్రగ్యా జైశ్వాల్. ఐతే అఖండ, అఖండ 2నే కాదు సంక్రాంతికి వస్తున్న డాకు మహారాజ్ సినిమాలో కూడా ప్రగ్యా నటించింది. డాకు మహారాజ్‌లో ప్రగ్యా జైశ్వాల్ నిజంగానే ఆడియన్స్ కు సర్ ప్రైజ్ ఇచ్చింది. సినిమాలో శ్రద్ధా శ్రీనాథ్, ఊర్వై రౌతెలా ఉన్నారని తెలుసు కానీ ప్రగ్యా జైశ్వాల్ కూడా ఉందని ఎవరు ఊహించలేదు. ట్రైలర్‌లో ప్రగ్యాని చూసి ప్రేక్షకులు సర్ ప్రైజ్ అయ్యారు. ఐతే బాలయ్య సినిమాకు ఆమె లక్కీగా మారుతుందని చెప్పొచ్చు. అఖండలో కలిసి నటించడం వల్ల అది సూపర్ హిట్ అయ్యింది. ఇక ఇప్పుడు రాబోతున్న డాకు మహారాజ్ కూడా బజ్ చూస్తుంటే పక్కా హిట్ అనేలా ఉంది. ఐతే డాకు మహారాజ్ లో తన సెలక్షన్ అంతా డైరెక్టర్ బాబీ చేతుల్లోనే ఉందని అన్నది ప్రగ్యా జైశ్వాల్. సినిమాలో నటించడం కోసం తనకు కాల్ వస్తే చాలా సర్‌ప్రైజ్‌గా ఫీలయ్యా అన్నది ప్రగ్యా జైశ్వాల్. ఐతే డాకు మహారాజ్ హిట్ పడితే ఎలాగు అఖండ 2 మీద భారీ హైప్ ఉంది కాబట్టి అది ఎలా ఉన్నా సక్సెస్ అందుకునే ఛాన్స్ ఉంటుంది. బాలకృష్ణ, ప్రగ్యా జైశ్వాల్ హిట్ పెయిర్‌గా సూపర్ క్రేజ్ తెచ్చుకుంటున్నారు. ఐతే బాలయ్య సినిమాలు తప్ప ప్రగ్యాకి మిగతా ఆఫర్లు రావట్లేదు. బాలకృష్ణకు మాత్రం ఆమె పర్ఫెక్ట్ జోడీ అనిపిస్తుంది. కెరీర్ కాస్త అటు ఇటుగా ఉన్నా ప్రగ్యా జైశ్వాల్ తనకు వచ్చిన అవకాశాలను చేస్తూ వస్తుంది. ఐతే ఆమె బాలయ్య సినిమాల్లో ఆఫర్ రావడం సంతోషాన్ని వ్యక్తపరుస్తుంది. డాకు మహారాజ్ హిట్ పడితే ప్రగ్యాకి వేరే సినిమాల ఆఫర్లు కూడా రావాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. ఏది ఏమైనా ప్రగ్యాని మన డైరెక్టర్స్ సరిగా వాడుకోవట్లేదు అన్నది ఇన్నర్ టాక్. మరి అమ్మడి ఫేట్ రాబోయే సినిమాతో అయినా మారుతుందేమో చూడాలి.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...









# సంక్రాంతి.. పరిపూర్ణమేనా?

ఈసారి సంక్రాంతి ముంగిట సినీ రంగంలో పెద్దగా గందరగోళం లేదు. ముఖ్యంగా థియేటర్ల గొడవ ఏమాత్రం కనిపించడం లేదు. గతంలో చాలా సందర్భాల్లో మూడుకు మించి సినిమాలు రిలీజయ్యేవి. వీటికి తోడు డబ్బింగ్ సినిమాల పోటీ ఉండేది. థియేటర్ల సర్దుబాటు విషయంలో గజిబిజి జరిగేది. కానీ ఈసారి మూడు సినిమాలే రిలీజవుతున్నాయి. పైగా డబ్బింగ్ సినిమాల గోలే లేదు. రిలీజవుతున్న మూడు చిత్రాల్లో రెండు దిల్ రాజు ప్రొడ్యూస్ చేసినవి. మూడో చిత్రాన్ని ఆయన డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాడు. దీంతో గందరగోళానికి, వివాదానికి ఆస్కారమే లేకపోయింది. ఇక మూడు చిత్రాల్లో ఏది ఎలా ఉంటుందో అన్న సందేహాలు మొన్నటిదాకా ఉండేవి. కానీ ఇప్పుడు చూస్తే మూడూ ప్రామిసింగ్‌గా కనిపిస్తున్నాయి. మూడూ సక్సెస్ అయితే ఆశ్చర్యం లేదనిపిస్తోంది.

సంక్రాంతికి రానున్న మూడు సినిమాలు రెండు రెండు రోజుల గ్యాప్‌లో రాబోతుండగా.. ట్రైలర్లను కూడా అదే గ్యాప్‌తో రిలీజ్ చేయడం విశేషం. ముందుగా జనవరి 2న 'గేమ్ చేంజర్' ట్రైలర్ వచ్చింది. అంతకు ముందు దాకా ఈ సినిమా కంటెంట్ మీద కొంచెం సందేహాలున్నాయి. అనుకున్నంత బజ్ కనిపించలేదు. కానీ ట్రైలర్ ఆకర్షణీయంగా ఉండడంతో ఆటోమేటిగ్గా బజ్ పెరిగింది. ఇది పక్కా బిగ్ స్క్రీన్ కమర్షియల్ ఎంటర్టైనర్‌లా కనిపిస్తోంది. ఇక 'డాకు మహారాజ్'కు కూడాలో బజ్ సమస్యగా మారింది. కానీ దీని ట్రైలర్ మాస్‌కు ఫుల్ మీల్స్ గ్యారెంటీ అనే సంకేతాలు ఇచ్చింది. ఇక చివరగా రిలీజైన 'సంక్రాంతికి వస్తున్నాం' ట్రైలర్.. ముందు నుంచే ఈ సినిమాపై ఉన్న పాజిటివ్ బజ్‌ను ఇంకా పెంచింది. ఇది పక్కా ఫ్యామిలీ ఎంటర్టైనర్ అనిపిస్తోంది. వెంకీ, అనిల్ రావిపూడి మార్కు ఎంటర్టైన్మెంట్‌తో సంక్రాంతి సినిమా సంబరం పీక్స్‌కు చేరేలా ఉంది. ట్రైలర్లతో పెరిగిన అంచనాలకు తగ్గట్లే సినిమాలు కూడా ఉంటే ఈ సంక్రాంతికి హండ్రెడ్ పర్సంట్ సక్సెస్‌తో బాక్సాఫీస్ మోత మోగిపోవడం ఖాయం. – తుపాకి.కామ్ సౌజన్యంతో...





పిట్ట కొంచెమే కానీ కూతా, చేత రెండూ ఘనమే. అం దుకే తన్మయ్ బక్షి పేరు ఇప్పుడు టెక్ రంగంలో ఓ సంచ లనం. ఎవరీ తన్మయ్ బక్షి..? కెనడాలో సెటిలైన భారత సంతతి బిడ్డడు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ లో తోపు. ఇప్పుడు విద్యా, ఆరోగ్యరంగాల్లో ఏఐతో అద్భుతాలు సృష్టించేందుకు బాల్యం నుంచే తనవంతు ప్రయత్నాలు చేసి వండర్ కిడ్ అనిపించుకున్న యువకుడు తన్మయ్ బక్షి. అయితే, ఆమధ్య తన్మయ్ బక్షి ప్రతిభను మరింత అతిశయోక్తి చేసి మరో ఫేక్ ప్రచారం కూడా ఊపందు కుంది. దాన్ని ఏకంగా తన్మయే తన ఎక్స్ (ట్విట్టర్ ఖాతా) ద్వారా ఖండించాడు. జస్ట్ 13 ఏళ్లకే గూగుల్ వంటి సంస్థ.. నెలకు 66 లక్షల జీతాన్నిచ్చి అపాయింట్ చేసుకున్న పంజాబీ పోరడన్నదే ఆ ఫేక్ ప్రచారం ఇప్పుడు మళ్లీ మొదలైంది. మొబైల్ ఫోన్స్ లో రీల్స్, షార్ట్స్‌కు అలవాటు పడి గంటలకు గంటలు గడుపుతున్న యువతను చూస్తున్న రోజుల్లో.. తన్మయ్ నిజంగానే ఏ యూనివర్సిటీలు కూడా తయారుచేయలేని ఓ గాడ్ గిఫ్ట్. కానీ, అదే సమయంలో తనపై జరుగుతున్న ప్రచారాన్ని వెంటనే ఖండించిన నిజాయితీ కూడా ఈ బాలుడి సొంతం.

# పలక పట్టాల్సిన వయసులో..

# కోడింగ్ నేర్చాడు!

**తన్మయ్ కి సాంకేతికరంగంపై ఎందుకంత అనురక్తి..?**

తండ్రి పునీత్ బక్షి ప్రభావం తన్మయ్ పై మెండు. దానికి తోడు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఐదేళ్లకే కోడింగ్ నేర్చుకున్న తన్మయ్.. ఇప్పుడు ప్రపంచం మొత్తం చర్చించుకునే ఓ టెక్నికల్ గడుగ్గాయి!

పునీత్ బక్షి కంప్యూటర్ ప్రోగ్రామర్. తండ్రి ప్రోగ్రామింగ్ చూసి తానూ అనుసరించడం మొదలెట్టాడు. అది గ్రహించిన తండ్రి పునీత్.. తన్మయ్ ఆసక్తికి తగ్గట్టుగా ప్రోగ్రామింగ్ లో శిక్షణనిప్పిం చాడు. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ తో సాఫ్ట్వేర్ డెవలప్ మెంటే కాదు.. అసలు కంప్యూటర్ వెనుకాల ఏం జరుగుతుంది.. అసలు కంప్యూ టర్ నే ఎలా నియంత్రించొచ్చు అనే బియాండ్ థాట్స్ చిన్నతనంలోనే తన్మయ్ ని వెంటాడాయి.

కేవలం ఏడేళ్లకే కోడింగ్ ట్యుటోరియల్స్, వెబ్ డెవలప్మెంట్ చిట్కాలను షేర్ చేసేందుకు సొంతంగా యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభిం చాడు. కోడింగ్ నేర్చుకోవాలనుకునేవారికి శిక్షణనివ్వాలనేది తన్మయ్ తపన. ఏకంగా లక్షమంది సబ్ స్క్రైబర్స్ కు పెరిగింది యూట్యూబ్ ఛానల్. యూట్యూబ్ ఛానల్‌లో కామెంట్ బాక్సులో ఎవరే ప్రశ్నడి గినా.. దానికి సంతృప్తికర సమాధానాలిచ్చేవాడు. తొమ్మిదేళ్ల వయ స్సులో ఏకంగా ఓ యాప్‌నే తయారుచేశాడు. గుణకారాలను బోధిం చే ఆ యాప్‌కు యాపిల్ స్టోర్ లోనూ అనుమతి లభించింది. ఇప్పుడు తన్మయ్ యూట్యూబ్ ఛానల్ సబ్ స్క్రైబర్స్ 3 లక్షల 28 వేలు. టెడ్ టాక్ షోలో తన్మయ్ ప్రసంగం టెక్ రంగ నిపుణులనే ఆశ్చర్యానికి గురిచేసింది.

**ఏఐతో ప్రయాణం!**

ప్రోగ్రామింగ్ లో అప్పటికే నైపుణ్యాన్ని సాధిస్తున్న తన్మయ్ ఓసారి తన యూట్యూబ్ ఛానల్‌లో ఓ వీడియో అప్లోడ్ చేస్తున్న సమయంలో ప్రశ్నకు సమాధానం చెప్పే యంత్రానికి సంబంధించిన ఐబీఎం వాట్సన్ కు సంబంధించిన ఓ డాక్యుమెంటరీని చూశాడు. ఇక అక్కడ సరిగ్గా 11 ఏళ్ల వయస్సులో తన్మయ్ జీవితం మరో అద్భుతమైన మలుపు తిరిగింది. ఇక అక్కడ్నుంచి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఐబీఎం వాట్సన్ పై ఫోకస్ చేశాడు. అదే పద్ధతిలో సరిగ్గా వారం తిరిగే సరికి 'అస్క్ తన్మయ్' అనే కొత్త వాట్సప్ యాప్‌ని తయారుచేశాడు బక్షి. వినియోగదారుల డౌట్స్ కు వేగవంతంగా ప్రతిస్పందించి సమాధానాలిచ్చే యాప్ అది.

వెనువెంటనే ఒక ఫార్మాట్లో ఉన్న డాక్యుమెంట్ ను మరో ఫార్మాట్ లోకి మార్చే ఐబీఎం కన్వర్టర్ పైన దృష్టి పెట్టిన తన్మయ్ ఆ సాఫ్ట్వేర్‌లో బగ్ ఉన్న విషయాన్ని కనిపెట్టాడు. దాన్ని ఐబీఎం సంస్థకు చెందిన ప్రోగ్రామింగ్ వెబ్‌సైట్ ద్వారా వారికి సమాచారమివ్వడంతో పాటు తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా షేర్ చేశాడు. అదిగో అక్కడ ఐబీఎం డెవలపర్స్ దృష్టి తన్మయ్‌పై పడింది. అలా ఐబీఎంతో తన్మయ్ బంధానికి నాంది పడింది. కానీ, అంత చిన్న వయస్సులో సాఫ్ట్వేర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ అన్నింటినీ అర్థం చేసుకోవడం అంత సులువైన పనేం కాదు. కానీ, అవి చేశాడు కాబట్టే తన్మయ్ సాఫ్ట్వేర్ రంగంలో ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. అలా ఐబీఎం తన ప్రతిభను నిరూపించుకునేందుకు ఒక వేదికైంది. మెషిన్ లెర్నింగ్ ద్వారా ఎంత పెద్ద సమస్యనైనా అధిగమించాలన్న తపనతో తన్మయ్ సాంకేతిక జర్నీ మరింత రాటుదేలుతూ ప్రారంభమైంది. అలా ఐబీఎంతో కలిసి ఫిన్లాండ్, న్యూజిలాండ్, డెన్మార్క్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లోనూ తన్మయ్ సెషన్లు నిర్వహించి టెక్ రంగ ప్రముఖులతో ఔరా అనిపించుకున్నాడు.

తన్మయ్ బక్షి తన యూట్యూబ్ ఛానల్ ద్వారా పసివయస్సులోనే ఓ విద్యావేత్త పాత్రను పోషిస్తున్నాడు. కోడింగ్ లో యువతను ప్రోత్సహించే విధంగా తన వీడియోస్ ఉండటంతో పాటు.. భారతీయ సమాజ విలువలు, విద్యను కూడా ప్రతిబింబించేలా రూపొందించడంతో తనకంటూ ఒక యునిక్ నెస్ ను సాధించాడు తన్మయ్.

**ఏ విజన్ ఫర్ ది ఫ్యూచర్!**

తన్మయ్ బక్షి సాంకేతిక రంగ ప్రయాణం కేవలం తన వ్యక్తిగత ప్రదర్శనకు మాత్రమే పరిమితం కావాలనుకోలేదు. టెక్నాలజీని అందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో తను ప్రయత్నిస్తున్నాడు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఎవరో కొందరు సాంకేతిక పరిజ్ఞానం ఉన్నవారి వరకు మాత్రమే పరిమితం కాకూడదన్నది బక్షి ఆలోచన. సమాజాన్ని ఉద్ధరించే ఓ శక్తిగా ఉపయోగపడాలన్నది తన్మయ్ బలమైన సంకల్పం. అందుకే ఎడ్యుకేషన్, హెల్త్ కేర్ రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అవసరాన్ని గుర్తించి.. ఇప్పుడా దిశగా ప్రయత్నాలు మొదలెట్టాడు తన్మయ్. ఏఐ ద్వారా ఈ రెండు ప్రధాన రంగాల్లో అట్టడుగువారికి కూడా ఎలా సేవలందించగలమనే ఒక శోధనకు ఇప్పుడు తన్మయ్ నాంది పలికాడు.

తన సాంకేతిక విజయాలను ప్రజల ముందుంచేందుకు "హాలో స్విఫ్ట్: ఐఓఎస్ యాప్ ప్రోగ్రామింగ్ ఫర్ కిడ్స్ అండ్ అదర్ బిగినర్స్" అనే పుస్తకాన్ని కూడా తీసుకొచ్చాడు.

గూగుల్ లో ఇంటర్వ్యూ ప్యానెల్‌లో ముగ్గురు కలిసి ఇంటర్వ్యూ చేద్దామనుకుంటే.. వారికే చెమటలు పట్టించేసిన 13ఏళ్ల బుడతడంటూ ఇదిగో ఇచ్చిన వీడియోనే ఇప్పుడు మళ్లీ వైరలవు తోంది. గూగుల్‌లో 66 లక్షల ఉద్యోగంతో మరోసారి వార్తల్లో పిడుగయ్యాడంటూ జరుగుతున్న ఈ ప్రచారాన్నే తన్మయ్ గతంలోనే కొట్టిపారే శాడు. ఆ ట్వీట్‌ను కూడా ఇక్కడ చూడొచ్చు.




తన్మయ్ ఎదుగుదల వెనుక తన తల్లిదండ్రుల పూర్తి మద్దతుతో పాటు.. కెనడా భారతీయ సమాజ పాత్ర కూడా కీలకమైంది. తన్మయ్ ప్రతిభకు మెచ్చిన తన చుట్టుపక్కల సొసైటీ తనను అంతే స్థాయిలో ప్రోత్సహించింది. తన్మయ్ ఇప్పుడు తన తోటివారికే కాదు.. వయస్సు గురించి లెక్కలు వేసుకుంటూ పొద్దుగడిపే వారెందరికో ఓ రోల్ మాడల్.

– బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...




ఆమదాలవలస–శ్రీకాకుళం ప్రధాన రహదారి పనులను దగ్గరుండి ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పర్యవేక్షించారు. సంక్రాంతిలోగా ఈ రహదారి అందుబాటులోకి వచ్చేలా చూడాలని కాంట్రాక్టర్‌ను కోరారు. దీనికి సంబంధించిన నిధులన్నీ రాబట్టామని, గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఈ రహదారి పరిస్థితి ఇలా తయారైందని కూన రవికుమార్ విమర్శించారు. ఇప్పటికైనా ఈ రహదారి పరిస్థితి మెరుగవుతున్నందుకు ఆనందంగా ఉందన్నారు.

– సత్యంన్యూస్, ఆమదాలవలస

## బాధిత కుటుంబాలకు వైకాపా పరామర్శ

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

నియోజకవర్గ పరిధిలోని జొన్నవలస గ్రామంలో కోర్టు ఉత్తర్వులు మేరకు ఆ గ్రామానికి చెందిన 23 ఇల్లు సోమవారం అధికారులు పూర్తిగా కొట్టేశారు. వారంతా నిరుపేద కుటుంబాలు కావడంతో నిరాశ్రయులై రోడ్డున పడిన పరిస్థితి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న వైకాపా ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్ బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి సానుభూతి తెలిపారు. దీంతో పాటు తాత్కాలికంగా వారు ఉండటానికి టెంట్‌లు వేయించి భోజనాలు ఏర్పాటు చేశారు. వారి పరిస్థితిపై అధికారులతో మాట్లాడి వారికి వెంటనే ఇళ్లస్థలాలు మంజూరు చేసి తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



## రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



(సత్యంన్యూస్, సారవకోట)

మండలంలోని పలు ప్రాంతాల్లో నిర్మించనున్న రోడ్ల నిర్మాణానికి శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి మంగళవారం శంకుస్థాపన చేశారు. టెక్కలి ఆర్ & బి రోడ్డు నుండి కూర్మనాథపురం గ్రామానికి రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా తెంబూరు, హిరమండలం రోడ్డు నుండి మూగుపురం గ్రామం వరకు రూ.70లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ కూటమి నాయకులు, కార్యకర్తలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌లు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు, స్టేట్‌వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్ దుంగ శ్రీధర్, శ్రీకాకుళం పట్టణ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు బుర్రి మధు, తెలుగుయువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు, దుంగ భాస్కర్, గంజి వాసు, గొండు శ్యామ్, సంతోష్ తదితరులున్నారు. – సత్యంన్యూస్, శ్రీకాకుళం

## ఎమ్మెల్యే పొత్తు ధర్మాన్ని విస్మరిస్తున్నారు

(సత్యంన్యూస్, కొత్తూరు)

పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పొత్తు ధర్మాన్ని విస్మరిస్తున్నారని కూటమి నేతల్లో గుసగుసలాడుకుంటున్నారు. నియోజకవర్గంలో ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా టీడీపీ నాయకులు తప్ప బీజేపీ, జనసేన పార్టీలకు సంబంధించిన నాయకులు కనిపించక పోవడమే ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. తమకు కనీస సమాచారం కూడా ఉండడం లేదని బీజేపీ-జనసేన కార్యకర్తలు వాపోతున్నారు. కూటమి నాయకులకు సరైన ప్రాధాన్యత ఇవ్వకుండా ఒక వర్గానికే ప్రాధాన్యత ఇవ్వడం గ్రూపు రాజకీయాల్లో ప్రోత్సహిస్తున్నట్టు ప్రజలు అనుకుంటున్నారు. పాతపట్నం నియోజకవర్గం గ్రూపు రాజకీయాలకు పెట్టింది పేరు. అన్ని గ్రూపులను కలుపుకొని వెళ్లకుండా కొన్ని గ్రూపులను మాత్రమే ప్రోత్సహిస్తున్నట్టు నాయకుల్లోను కార్యకర్తల్లోనూ తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. కూటమి విజయం కోసం కష్టపడిన తమకు కనీసం నామినేటెడ్ పదవులు అయినా దక్కుతాయా అన్నది ప్రశ్నార్థకంగా మారుతోంది.



## ఆపదలో ఉన్న వృద్ధులకు రక్తదానం



(సత్యంన్యూస్, టెక్కలి)

స్థానిక జిల్లా ఆసుపత్రిలో సుంకాన నరసమ్మ, జి భారతమ్మ అనే వృద్ధులు ప్రమాదవశాత్తు ఇంటిలోపడిపోయి ఒకరికి కాలు, ఇంకొకరికి చేయి విరిగిపోవడంతో వైద్యులు ఆపరేషన్ చేసే ముందు రక్తం ఎక్కించాలని కుటుంబసభ్యులకు తెలియజేశారు. రక్తదానం చేయడానికి బంధువులు ఎవరు అందుబాటులో లేకపోవడంతో భాదితులు టెక్కలి అభయం యువజన సేవాసంఘం వారిని కలవడంతో స్పందించిన సేవాసంఘం సభ్యులు బ్లడ్‌బ్యాంక్ వారితో మాట్లాడి ఇద్దరు వృద్ధులకు రక్తాన్ని అందించినట్లు అభయం సేవాసంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అభయం సేవాసంఘం ట్రెజర్ శ్రీనివాస్ బెహరా, సంఘ సభ్యులు జె ఆదినారాయణ, జె శశుభూషన్, ఎం.దుర్గారావు, పి సింహాచలం స్టాఫ్‌నర్స్ మాధురిలు పాల్గొన్నారు.

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే, ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

## కార్గిల్ పార్క్‌లో ఏమేరకు తినేశారు?

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటి వరకు పనులు జరిగాయని ఇంజినీరింగ్ అధికారులు చూపించిన వాటిని పరిశీలించారు. గతంలో కార్గిల్ పార్క్‌లో ఉన్నవి ఏమిటి? ఇప్పుడు ఆధునీకరించినవి ఏమిటి? అన్నదానిపై డీఈ కమలాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. రూ.50 లక్షల పనుల్లో ఎంత మేరకు పూర్తయ్యాయి? ఏమేరకు బిల్లులు చెల్లింపు అయింది? ఇంకా ఏయే పనులు పెండింగ్‌లో ఉన్నాయి? అన్న వివరాలు సమగ్రంగా నమోదుచేసి తన టేబుల్‌పై ఉంచాలని సూచించారు. పార్కులో మట్టిని ఫిల్ చేసే పనులు పూర్తిస్థాయిలో లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు భోగట్టా. 'సత్యం'లో వచ్చిన కథనంపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ కోరడంతో సంబంధిత డీఈ, ఈ పనులను పరిశీలిస్తున్న ఏఈల నుంచి ఎంబుక్‌ను తెప్పించి కమిషనర్ నివేదిక సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తుంది. ఈ పార్క్‌కు కేటాయించిన నిధులతో పనులు పూర్తయిపోయాయని నమ్మించే ప్రయత్నం చేయడంతో 'సత్యం' ఆధారాలతో సహా ఓ కథనాన్ని ప్రచురించడం, అందులో పార్క్‌లో నీరు నిల్వ ఉన్న ఫొటోలు కనిపిస్తుండటంతో మట్టిని పూర్తిస్థాయిలో నింపే ప్రక్రియకు కమిషనర్ రంగం సిద్ధం చేశారని తెలుస్తుంది.

## ఒక్క పేకాట.. వంద దరిద్రాలు

(మొదటిపేజీ తరువాయి)

దిగేసుకోడానికి, విలాసవంతమైన జీవితాన్ని గడపడానికి స్వార్థంతో నిర్వహిస్తున్న పేకాట శిబిరాలకు వెళ్లి లక్షలాది రూపాయలు పోగొట్టుకోవడం, ఆమేరకు అప్పులైపోవడంతో ఆ యువకుడు నిండుప్రాణాన్ని చెట్టుకు వేలాడదీసుకున్నాడు. ఈ విషయం స్థానికులకు తెలుసు. పేకాడి, అక్కడ మోసానికి బలైపోయి గెలుపే లేకుండా డబ్బులు పోగొట్టుకొని అప్పులపాలైపోవడంతో కుటుంబంలో మనస్పర్థలు వచ్చాయి. దాని పర్యవసానమే ఆత్మహత్య. ఇప్పుడు దీనికి బాధ్యులెవరు? దీన్ని హత్య అనాలా? ఆత్మహత్య అనాలా? సాధారణంగా పరువు గల కుటుంబం కాబట్టి ఎక్కడా బయటపెట్టకుండా విధిరాతను నిందిస్తూ అంత్యక్రియలు చేసేశారు.


ఆమధ్య నరసన్నపేట నియోజకవర్గంలో ఒక యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందాడు. సహజంగానే ఈ కేసు కూడా అందరిలాగే క్లోజ్ అయిపోయింది. రణస్థలంలో ఒక వ్యక్తి కనిపించకుండాపోయాడు. అక్కడికి కొద్ది రోజుల తర్వాత ఎక్కడో శవమై కనిపించాడు. ఇదీ ఆత్మహత్యే. ఈమధ్య కాలంలో ఆత్మహత్యల మూలాల్లోకి వెళితే.. ప్రతీ ఆత్మకు ఓ కథ ఉంది. ఆ కథలో పేకాటుంది. ఆ పేకాట వెనుక ఒకే ఒక సిండికేటుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఇవి ఆత్మహత్యలు కావు. కేవలం పేకాట నిర్వాహకులు చేస్తున్న హత్యలు. పేకాడటం క్లబ్‌లలో నాగరికత కావచ్చు. డబ్బున్నవాడికి స్టేటస్ సింబల్ కావచ్చు. కానీ పేకాడటం ద్వారా డబ్బులు సంపాదించడం ఒక వృత్తిగా భావించినవారు శిబిరాలను నిర్వహించడమే ప్రవృత్తిగా మార్చుకున్నవారి చేతిలో ఇలా పరోక్షంగా హత్యకు గురవుతుంటారు. క్రికెట్ బెట్టింగుల్లో సర్వస్వం కోల్పోయి రోడ్డున పడిన యువకుల జీవితాల కోసం 'సత్యం' అనేక కథనాలు గతంలో ప్రచురించింది. అలాగే నగరంలో మధురానగర్‌లో ఉన్న పేకాట క్లబ్‌ను మూయించేవరకు కథనాల ద్వారా పోరాడింది. ఆ సందర్భంలో అనేకమంది బాధితులు 'సత్యం' వరండాలో కన్నీరు పెట్టుకున్న సందర్భాలూ తెలుసు. అయితే ఇప్పుడు సమస్యను మరొకరితో పంచుకోవడం, బాధ నుంచి బయటపడటం వంటి మౌలిక సూత్రం ఈతరానికి తెలియకపోవడంతో ఏకంగా ప్రాణాలే తీసుకుంటున్నారు. పేకాట శిబిరాలు నిర్వహించేది ఒడిశాలో కావచ్చు. కానీ సొమ్ములు పోతున్నది, జీవితాలు కోల్పోతున్నది ఇక్కడివారే. మానవీయ కోణాన్ని మరచి సొమ్ములు సంపాదించడమే పరమావధిగా పెట్టుకుంటే ఏం జరుగుతుందో తెలిపే ఘటనలే ఇవి.

పేకాట శిబిరాల నిర్వహణ ప్రస్తుతం లాభసాటి వ్యాపారంగా మారడం, పత్రికల్లో కథనాలు వస్తున్నా ఎక్కడా వెనక్కి తగ్గని టెంపరితనం చూపించడంతో ఈ వ్యాపారం వైపు మరికొందరు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగానే పోలాకి మండలం వెదుళ్లవలసకు చెందిన కూర్మారావు గోపి, తేజల సిండికేట్‌లో కొత్తగా పెట్టుబడులు పెట్టినట్టు పేకాట వర్గాల భోగట్టా. పేకాడుతున్న వారిలో ఎక్కువ మంది యువకులు, ప్రభుత్వ ఉద్యోగులు. గడిచిన 10 రోజుల్లో పేకాట నిర్వాహకులకు అన్ని ఖర్చులు పోనూ రూ.68 లక్షలు లాభం సమకూరినట్టు తెలిసింది. రోజుకు సుమారు రూ.కోటి లావాదేవీలు జరుగుతున్నట్టు సమాచారం. ఈ లెక్కన పేకాటకు వచ్చేవారు ఎంత మొత్తం సమర్పించుకుంటున్నారో అర్థం చేసుకోవాలి.

పేకాట నిర్వాహకులతో పాటు నగరానికి చెందిన శ్రీను అనే కానిస్టేబుల్ పేకాడడానికి వెలుతున్నట్టు సమాచారం. ఈయన అల్లుడు కూడా పోలీసు శాఖలో అధికారిగా పని చేస్తున్నారని చెప్పుకుంటున్నారు. పేకాడడంతో పాటు మిగిలిన జూదర్లను పోలీసుశాఖ పేరు చెప్పి బెదిరిస్తున్నట్టు తెలిసింది. వీడియోలు తీసి నిర్వాహకులను, జూదర్లను బెదిరిస్తుంటాడని ఆడడానికి వెళ్లినవారు చెబుతున్నారు. ఈయన అండతోనే బెండి తులసి, తాండ్ర తేజ, గోపి, కూర్మారావు పేకాట ఒడిశాలో పేకాట శిబిరాలను గత ఆరు నెలలుగా నిరాటంకంగా నిర్వహిస్తున్నారు.

గత నెలలో నకిలీ కరెన్సీని చెలామణి చేస్తున్న రెండు ముఠాలను జిల్లాలో పోలీసులు పట్టుకున్నారు. అందులో ఒకటి ప్రస్తుతం పేకాట శిబిరం నిర్వహిస్తున్న ఒడిశాలోని గారబందకు వెళ్లే మార్గంలోని మెళియాపుట్టిలో కావడం గమనార్హం. ఈ ముఠాకు పేకాట శిబిరం నిర్వహిస్తున్న గోపితో సంబంధాలు ఉన్నట్టు ప్రచారం ఉంది. ఈ ముఠాతో ఉన్న సంబంధాలతో 200 మందికి పైగా వచ్చి ఆడుతున్న పేకాట శిబిరంలో నకిలీ నోట్లు చలామణి చేసినట్టు ప్రచారం ఉంది. వరుసగా నాలుగు రోజుల పాటు పేకాట శిబిరంలో నకిలీ నోట్లతోనే తులసీ, తేజా, గోపీ ఆడించినట్టు జూదర్లు చెబుతున్నారు. నకిలీ నోట్ల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత వాటి చలామణిని తాత్కాలికంగా నిలిపేసినట్టు తెలిసింది. తులసీ, తేజ, గోపీతో కొత్తగా జత కట్టిన కూర్మారావు డబ్బులు తీసుకొని కాయిన్స్ ఇవ్వడం, శిబిరం మధ్యలో ఉండి పేకలను అందించడం చేస్తున్నాడని చెబుతున్నారు. పలాస-కాశీబుగ్గలో ఆత్మహత్య చేసుకున్న యువకుడు కూడా శిబిరాల వద్దే ఫైనాన్స్ చేసినవారి నుంచి అప్పు తీసుకోవడం, అది వడ్డీతో సహా తడిసి మోపెడవడంతో తీర్చలేక, అక్కడ రౌడీలు ఇచ్చిన వార్నింగ్‌ను భరించలేక ఆత్మహత్యకు పూనుకొన్నాడని పోలీసులు గ్రహిస్తే బాగున్ను.

## రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతా




(సత్యంన్యూస్, ఆమదాలవలస)

బూర్జ మండలం కంట్లాం పంచాయతీ లచ్చయ్యపేట గ్రామాల రైతులకు న్యాయం జరిగేవరకు తాను పోరాడుతానని బూర్జ వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు పేర్కొన్నారు. మంగళవారం కంట్లం పంచాయతీ పరిధిలో స్థానిక తహసీల్దార్ వై.వి.పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లచ్చయ్యపేట రెవెన్యూ పరిధిలో సుమారు 60 ఎకరాలకు సంబంధించి, 146 మంది రైతులు భూములు గయాల భూములుగా రికార్డుల్లో నమోదు కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుల భూములు వివాదాలు తొలగించి వారికి అండగా నిలవాలని, లేనిపక్షంలో న్యాయపోరాటం తప్పదని హెచ్చరించారు. రెవెన్యూ సదస్సులో మండల సర్వేయర్ గురుగుబెల్లి రాజశేఖర్, సర్పంచ్ సూరపు ఉదయ కుమార్, వీఆర్వో ఉమామహేశ్వరరావు, సర్వేయర్ ఎస్.స్వాతి, తెలుగుదేశం నాయకులు, మాజీ సర్పంచ్ గిరడ హరిబాబు, జి.గోవిందరావు, అనిల్, నీలకంఠం, నాగరాజు, బైరి మల్లేసు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# పిడకేనని తీసిపారేయకండి

## - నగరంలో రెడీమేడ్ భోగిపిడకలు అమ్మకం -

సత్యంన్యూస్, శ్రీకాకుళం

***అలా పిడకమొహమేసుకొని కనిపించకపోతే కాస్త కడుక్కొని రావచ్చు కదా.. ఆ కుంపటి కింద ఒక పిడక పెట్టండి.. వెలిగి సావడంలేదు.*** .. ఇలా పిడకను తీసిపారేయాల్సిన అవసరం ఇక లేదేమో!? ఎందుకంటే ఇప్పటి వరకు భోగిమంటల్లో వేయడానికి మనమే పేడను సమీకరించి పిడకలు కొట్టి, దండలు గుచ్చి నానా యాతనా పడ్డాం. ఇకనుంచి ఆ పని మేం చేస్తామంటూ ఆన్‌లైన్ ఈకామర్స్ సంస్థలు వచ్చాయి. అమెజాన్ వంటి ప్లాట్‌ఫారమ్‌లో కౌడంగ్ పిడకలంటూ ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టారు. బహుశా ఈ వ్యాపారం బాగా జరిగిందేమో తెలీదుగానీ, మన నగరంలో కూడా భోగమంటల్లో వేసేందుకు పిడకలను తయారుచేసి రడీమేడ్‌గా అమ్మకం మొదలుపెట్టారు. స్థానిక పెద్దపాడు రోడ్డులో బూర్జ మండలం అన్నంపేటలో ఉన్న వ్యవసాయ క్షేత్రం నుంచి సేకరించిన ఆవుపేడతో పిడకలు తయారుచేశామంటూ రూ.50కి ఓ ప్యాకెట్ చొప్పున అమ్ముతున్నారు. సంక్రాంతి సంస్కృతి నగరాల్లో తగ్గిపోయినా భోగమంటలు మాత్రం ప్రతీ వీధిలోను పోటీపడి వేయడం మాత్రం ఆగలేదు. అందుకేనేమో సంక్రాంతికి చెరకుగడ కొననివారు సైతం భోగిమంటల్లో మాత్రం పిడకలు వేస్తున్నారు. మీరు 80 నుంచి 90 దశకాల్లో పుట్టి పెరిగిన పిల్లలైతే పేడ కోసం పరిగెత్తడం, చేతులంతా పేడ చేసుకొని పిడకలు వేయడం, వాటిని ఎండబెట్టడం, పక్కోడి పిడకలు దొంగిలించడం వంటివి చేసినందుకు ఇప్పుడు బాధపడితే ప్రయోజనం లేదు. ఎంత ఈ-కామర్స్‌లో దొరికినా నగరంలో తోపుడుబండ్ల మీద ప్యాక్ చేసి అమ్ముతున్నా పేడ కోసం పరుగెత్తి పిడక చేసి అందరికంటే పెద్ద దండ నేనే వేశానన్న ఫీలింగ్ ఉంటుంది చూశారూ.. అది ఎంత ఇచ్చినా మళ్లీ దొరకదు.

## కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే 80 శాతం నివారించవచ్చు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


ప్రాథమిక దశలో బాలల్లో క్యాన్సర్‌ను గుర్తించినట్లయితే తప్పనిసరిగా వ్యాధి నుంచి వారిని రక్షించవచ్చని, తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్య పరిరక్షణలో జాగ్రత్త వహించాలని లయన్ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ అన్నారు. శ్రీకాకుళం హర్షవల్లి లయన్స్ క్లబ్, శ్రీకాకుళం మంగళవారం ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ శ్రీకాకుళంలో జరిగిన బాల్యంలో క్యాన్సర్ నివారణ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పిల్లల ఆరోగ్యంలో హెచ్చుతగ్గులు తేడాలు వచ్చినప్పుడు గమనించి తక్షణమే వైద్యుల దగ్గరికి తీసుకెళితే సత్ఫలితాలు ఉంటాయన్నారు. బయట ఆహారం, ముఖ్యంగా జంక్ ఫుడ్స్ పిల్లలకు తిననివ్వకుండా చూడాలని, ఇంటి దగ్గర తయారుచేసిన ఆహారాన్ని అందించాలని, అమ్మ చేతి వంట అమృత సమానమని అన్నారు. హర్షవల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ వావిలపల్లి జగన్నాథ నాయుడు, లయన్స్ ఇంటర్నేషనల్ విద్యా సంక్షేమ చైర్మన్ హారిక ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి, వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలను సూచించి అవగాహన కలిగించడానికి వివిధ పాఠశాలల్లో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి.దేవదత్తా నంద్ మాట్లాడుతూ తమ పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హర్షవల్లి లయన్స్ క్లబ్ కార్యదర్శి మనిశర్మ, లయన్ తరళి, ఉపాధ్యక్షుడు తర్లాడ అప్పలనాయుడు, డైరెక్టర్స్ పార్వతీశ్వరరావు, లక్ష్మీకాంత్, లక్ష్మణ్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## కళాకారుని మృతికి 'ఉరసం' సంతాపం

(సత్యంన్యూస్, పలాస)

బొడ్డపాడు గ్రామ సీనియర్ కళాకారులు గేదెల అప్పారావు (62) కిడ్నీ వ్యాధితో మంగళవారం చనిపోవడంతో ఉద్దానం రచయితల సంఘం (ఉరసం) సంతాపం వ్యక్తం చేసింది. అప్పారావు కళారంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఉద్దానం రచయితల సంఘం ఆధ్వర్యంలో 2024వ సంవత్సరానికి గాను కుత్తుం తాతారావు స్మారక పురస్కారాన్ని అందజేసిన విషయాన్ని గుర్తుచేశారు. తన జీవితాన్ని కళారంగానికే అంకితం చేసి ఉద్దాన ప్రాంతంలో, మరీ ముఖ్యంగా బొడ్డపాడు గ్రామంలో ఎంతోమంది యువకులను కళా రంగం బాట పట్టించారని, ఉద్దానంలో బహుళ ప్రాచుర్యం పొందిన అత్తాకోడళ్లు పగటి వేషానికి సరికొత్త బాణీలతో ఎంతో వన్నె తెచ్చారని అన్నారు. అండమాన్, బిలాయ్ లాంటి ఎన్నో ప్రాంతాల్లో కోలాటం, కోయడాన్స్ ప్రదర్శించడంలో ముఖ్య భూమిక పోషించారని, గ్రామ ఉత్సవాల్లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకు తన సారధ్యంలోనే యువతను సిద్ధం చేసి, ఉద్దానం ప్రాంతంలోనే బొడ్డపాడు కళారంగాన్ని కీర్తి పతాకంలో నిలిపారని గుర్తుచేశారు.



## గ్రిగ్స్ తొలిరోజున కడుము పాఠశాల ప్రతిభ




(సత్యంన్యూస్, కొత్తూరు)

పాతపట్నం నియోజకవర్గం స్థాయిలో ప్రారంభమైన మూడు రోజుల 68వ ఇంటర్ స్కూల్ అథ్లెటిక్స్ అసోసియేషన్ గ్రిగ్స్ పోటీల్లో కడుము జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రెండు విభాగాల్లో విజేతలుగా నిలిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొర్లె తిరుమలరావు, సీనియర్ స్కూల్ అసిస్టెంట్ తూతిక సురేష్ తెలిపారు. నివగాం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో తొలిరోజు నిర్వహించిన బాలికల వాలీబాల్ పోటీల్లో ప్రథమ, బాలికల కబడ్డి పోటీల్లో ద్వితీయ స్థానాల్లో నిలిచి బహుమతులు పొందారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జన్ని చిన్నయ్య, సాంఘిక శాస్త్రోపాధ్యాయులు కుదమ తిరుమలరావులు పాల్గొని బాలికలతో పాటు షీల్డ్‌లు, ప్రశంసా పత్రాలు స్వీకరించారు. నివగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయని సువ్వారి నిర్మల, వ్యాయామ ఉపాధ్యాయులు బొమ్మాళి భాస్కరరావు, కోల రాజారావు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి జిల్లా స్థాయిలో శ్రీకాకుళంలో జరుగనున్న పోటీలకు పంపించనున్నట్లు వారు తెలిపారు. తొలుత పాతపట్నం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన 14 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన బాలబాలికలకు మూడు రోజుల పాటు జరిగే గ్రిగ్స్ పోటీలను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు.

విజేతలైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు గొర్లె తిరుమలరావు, ఉపాధ్యాయులు తూతిక సురేష్, దార జ్యోతి, పెయ్యల రాజశేఖరం, బందారు గాయత్రి, వల్లూరు లక్ష్మనాయుడు, శివకల శ్రీవాణి, బత్తుల వినీల, పడాల సునీల్, జన్ని చిన్నయ్య, కుదమ తిరుమలరావు, ముదిల శంకరరావు, కింజరాపు నిర్మలాదేవి, బోనెల కిరణ్ కుమార్, గేదెల వెంకట భాస్కరరావు, గుంటు చంద్రం, యందవ నరేంద్రకుమార్, రబికుమార్ మహాపాత్రో, సస్మితా పాడి, సింగంశెట్టి మురళీ కృష్ణలు ప్రశంసించారు.

## ఎమ్మెల్యే గ్రీవెన్స్‌కు విన్నపాల వెల్లువ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎమ్మెల్యే గొండు శంకర్ నిర్వహిస్తున్న ప్రజా గ్రీవెన్స్‌కు విన్నపాలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలోని విశాఖ-ఎ కాలనీ టీడీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజాగ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఉదయం నుంచే ప్రజలు అర్జీలను అందజేసేందుకు పెద్ద ఎత్తున కార్యాలయం వద్దకు చేరుకున్నారు. గార, శ్రీకాకుళం రూరల్, నగర ప్రజల సమస్యలను తెలుసుకున్న గొండు శంకర్ సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపించారు. ముఖ్యంగా గ్రామాల్లో రోడ్లు, కాలువలు, డ్రైన్లు నిర్మాణం చేపట్టాలని ప్రజల నుంచి అధికంగా వినతులు వచ్చాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో పల్లె పండుగ, గ్రామసభలు నిర్వహించి సమస్యలను గుర్తించి రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడుల సహకారంతో నియోజకవర్గ వ్యాప్తంగా పూడికతీత పనులు, నగర పరిధిలో డ్రైన్లలో షిల్టు తొలగింపు చేపట్టినట్టు చెప్పారు. ఎటువంటి సమస్యలను ఉన్నా తనను నేరుగా కార్యాలయంలో కలవచ్చునని ఎమ్మెల్యే కోరారు.






Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.